సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 26 । జనవరి । 2025



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్‌డీసీ లోకేశ్వరరావు, తహసీల్దార్ రామకృష్ణ

బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డును కలెక్టర్ దినేష్‌కుమార్ అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌చేతుల మీదుగా స్వీకరించారు. ఆయనతోపాటు టీడబ్ల్యూ ఎస్‌డీసీ లోకేశ్వరరావు, రంపచోడవరం తహసీల్దార్ పి.రామకృష్ణ, పాడేరు 153 బీఎల్వో వి.సౌందర్య, అరకు 294 బీఎల్వో సుందరరావు కూడా అందుకున్నారు. – సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

అమ్మవారి మూలవిరాట్‌ను తాకిన సూర్య కిరణాలు



రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు

సాక్షి,పాడేరు: పట్టణంలోని పురాతన ఉమానీల కంఠేశ్వరస్వామి ఆలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌ను శనివారం ఉదయం సూర్యోదయ సమయంలో సూర్యకిరణాలు తాకాయి. ఈ అద్భుత దృశ్యాన్ని భక్తులు వీక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామం , ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, భక్తులు అమ్మవారికి కుంకుమ నిర్వహించారు.

చింతపల్లి ఆస్పత్రికి జ్వర పీడితుల తాకిడి



చింతపల్లి ఏరియా ఆస్పత్రి వార్డులో చికిత్స పొందుతున్న జ్వర బాధితులు

చింతపల్లి: జ్వర పీడితులతో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కిటకిటలాడుతోంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో పెరుగుతున్న చలి తీవ్రత కూడా జ్వరాల తీవ్రతకు కారణమవుతోంది. చింతపల్లి, గూడెం కొత్తవీధి మండలాలకు పెద్ద దిక్కుగా ఉన్న ఈ ఏరియా ఆస్పత్రికి ప్రతిరోజు 350 నుంచి 400 మందికి పైగా రోగులు వస్తున్నారు. వీరిలో ఎక్కువ సంఖ్యలో జ్వర బాధితులు ఉన్నారు. ఈనెలలో 25వ తేదీ వరకు 450 రక్తపూతలు సేకరించగా, వీటిలో 18 మందికి మలేరియా, 227 మంది డెంగ్యూ పరీక్షలు నిర్వహించగా 9 మందికి టైఫాయిడ్ నిర్ధారణ అయింది. ప్రధానంగా ఎక్కువ మంది వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రిలోనే ఉండి చికిత్స పొందుతుండటంతో వార్డులు రోగులతో నిండిపోయాయి.

బాలికల ఆశ్రమ పాఠశాల తనిఖీ



అనంతగిరి పాఠశాలలో భోజన మెనూను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి(అరకులోయ టౌన్): అనంతగిరి ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శనివారం తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందించాలని డిప్యూటీ వార్డెన్‌కు సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి. నీలవేణి, వైఎస్సార్‌సీపీ నేత చందు తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా తగ్గని చలి తీవ్రత

- చింతపల్లిలో 6.8 డిగ్రీల నమోదు



చింతపల్లి ప్రాంతంలో కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నా శీతల గాలులు, చలితీవ్రత ఏమాత్రం తగ్గలేదు. దీంతో మన్యం ప్రజలు చలితీవ్రతకు వణికిపోతున్నారు. శనివారం చింతపల్లిలో 6.8 డిగ్రీలు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అల్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధి హుకుంపేటలో 7.8 డిగ్రీలు, జి. మాడుగులలో 8.3, పాడేరులో 8.3, అరకువ్యాలీలో 8.4, డుంబ్రిగుడలో 8.6, పెదబయలులో 9.0, జీకే వీధిలో 9.6, ముంచంగిపుట్టులో 12.0, కొయ్యూరులో 14.2, అనంతగిరిలో 14.7 డిగ్రీలు నమోదు అయినట్టు ఆయన తెలిపారు. చింతపల్లి ప్రాంతంలో ఉదయం 9 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. హెడ్‌లైట్ల వెలుగులో వాహన చోదకులు రాకపోకలు సాగించారు. చలితీవ్రతకు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



హుకుంపేట వారపు సంతలో పిప్పలమోడి, కాఫీ గింజల కొనుగోళ్లు



కిలో రూ.300కు వ్యాపారులు కొనుగోలు చేసిన పిప్పలమోడి

గిరిజనుల కష్టం.. దళారుల భోజ్యం

- హుకుంపేట వారపు సంతలో నిలువుదోపిడీ
- పార్చ్‌మెంట్ కాఫీకి గిట్టుబాటు ధర కరువు
- కానరాని జీసీసీ కొనుగోలు కేంద్రం
- సిండికేట్‌గా ఏర్పడిన వ్యాపారులు
- కిలోకు రూ. 70 తగ్గించేయడంతో తీవ్ర నష్టం
- పిప్పలమోడి ధరను కూడా తగ్గించేసిన వ్యాపారులు
- భారీగా ఆదాయం కోల్పోయిన గిరిజనులు

గిరిజన రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు కల్పించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. హుకుంపేటలో శనివారం జరిగిన వారపు సంతలో గిరిజనులకు ఎదురైన ఇబ్బందులే ఈ విషయాన్ని రుజువుచేశాయి. కాఫీ రైతుల వద్దకు వెళ్లి ఉత్పత్తులను కొనుగోలు చేస్తామని ప్రచారం చేసిన గిరిజన సహకార (ప్రభుత్వ రంగ) సంస్థ వారపు సంతలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో గిరిజనులు నష్టపోయారు. దీనిని ఆసరాగా తీసుకుని వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గించేయడంతో కాఫీ రైతులు ఆదాయం కోల్పోయారు. జాతీయస్థాయి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న పిప్పలమోడికి ఇదే పరిస్థితి ఎదురైంది.

సాక్షి,పాడేరు: జిల్లాలోని గిరిజన రైతులు దోపిడీకి గురవుతున్నారు. కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. దీనిని ఆసరాగా తీసుకుని వ్యాపారులు తక్కువ ధరకు పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ దోచుకుంటున్నారు.

- జాతీయస్థాయి మార్కెట్‌లో కాఫీ గింజలు కిలో రూ.450, పిప్పలమోడి కిలో రూ.500 ధరకు కొనుగోలు చేస్తున్నారు. స్థానిక వారపు సంతల్లో మాత్రం వ్యాపారులు తక్కువ ధర చెల్లించి నిలువునా మోసం చేస్తున్నారు. దీంతో కాఫీ, పిప్పమోడి అమ్ముకుంటున్న రైతులకు నష్టాలే మిగులుతున్నాయి.
- హుకుంపేటలో శనివారం జరిగిన వారపుసంతలో వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి కాఫీ, పిప్పలమోడి ధరలను పతనం చేశారు. గిరిజనులను ఆదుకోవాల్సిన గిరిజన సహకార సంస్థ కాఫీ గింజల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయలేకపోవడం వల్ల ఆదాయం కోల్పోయారు. గిరిజన సహకార సంస్థ కిలో పార్చ్‌మెంట్ కొనుగోలు ధర రూ.320 ప్రకటించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారపు సంతలో జీసీసీ కొనుగోలు కేంద్రం కనిపించకపోవడంతో పార్చ్‌మెంట్ కాఫీ గింజలను వ్యాపారులు నిర్ణయించిన రూ.250కు అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ సంతలో సుమారు రూ.50 లక్షల మేర వ్యాపారం జరిగింది. కిలోకు రూ.70 చొప్పున కాఫీ రైతులు ఆదాయం కోల్పోయారు.
- ఈశాన్య రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉన్న పిప్పలమోడికి కూడా హుకుంపేట వారపు సంతలో గిట్టుబాటు ధర లభించలేదు. అరకు వారపు సంతలో కిలో రూ.330కు కొనుగోలు చేసిన వ్యాపారులు శనివారం జరిగిన సంతలో కిలో రూ.300కు కొనుగోలు చేశారు. సుమారు రూ.40 లక్షల మేర పిప్పలమోడి అమ్మకాలు జరిగినప్పటికీ కిలోకు రూ.30 చొప్పున గిరిజన రైతులు ఆదాయం కోల్పోయారు.

తీవ్రంగా నష్టపోతున్నాం



కాఫీ, పిప్పలమోడి పంటలకు ఏజెన్సీ సంతల్లో గిట్టుబాటు ధరలు కరువయ్యాయి. హుకుంపేట సంతలో వ్యాపారులంతా సిండికేట్‌గా మారారు. జీసీసీ కూడా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం అన్యాయం. పిప్పలమోడి, కాఫీ గింజలను తక్కువ ధరకు అమ్మాల్సి వచ్చింది. దీంతో తీవ్రంగా నష్టపోయాం. ప్రభుత్వం గిరిజన వ్యవసాయ, వాణిజ్య ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి. – గెమ్మెలి రాజేంద్రరావు, రైతు, కామయ్యపేట, హుకుంపేట మండలం

జీసీసీకి విక్రయించాలి

జీసీసీ సిబ్బంది కాఫీ గింజలను నేరుగా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. సంతల్లో కొనుగోలు కేంద్రాలను ప్రస్తుతానికి ఏర్పాటు చేయలేదు. కాఫీ గింజల సీజన్ అయిన తరువాత సంతల్లో వ్యవసాయ, వాణిజ్య ఉత్పత్తుల కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం.గిరిజన రైతులంతా కాఫీ గింజలను గ్రామాల్లోనే జీసీసీకి విక్రయించాలి.ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకుని మోసపోవద్దు. – డి.సింహాచలం, జీసీసీ డీఎం, పాడేరు

అధైర్యం వద్దు.. అండగా ఉంటాం

- ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు భరోసా
- కూటమి ప్రభుత్వం కక్ష సాధింపునకు దిగితే పోరాటానికి దిగుతామని హెచ్చరిక



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంత బాబు, వేదికపై మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

మారేడుమిల్లి: వైఎస్సార్ సీపీ శ్రేణులు అధైర్యపడవద్దని, ఎవరికి ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామని ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్ (అనంతబాబు), రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సత్తి సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన శనివారం స్థానిక వనవాసీ వర్తక కేంద్రం వద్ద పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దీనిలో భాగంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మండలంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్ నుంచి వార్డు మెంబర్ల వరకు మెజార్టీ ప్రజాప్రతినిధులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారే ఉన్నారన్నారు. ఏ అధికారిక కార్యక్రమం జరిగినా ప్రొటోకాల్ ప్రకారం మొదటిగా సర్పంచ్, ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘించి హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందేవన్నారు. ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మి రాష్ట్ర ప్రజలు నష్టపోయారన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ. ప్రభుత్వం వచ్చి సుమారు ఎనిమిది నెలలు కావస్తున్నా నేటికి హామీలను అమలుచేయలేకపోయిందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన రహదారులను నేటి పాలకులు ప్రారంభిస్తున్నారన్నారు. తమ హయాంలో 90 శాతం రహదారులు పూర్తి చేశామని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేసేవరకు ప్రజల పక్షాన పోరాటం చేయాలని పిలుపు నిచ్చారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీలు లక్కోండ రవికుమార్, తుమ్మిడు లత, కో–అప్షన్ సభ్యుడు గురుకు దర్మరాజు, రంపచోడవరం మండల అధ్యక్షుడు జల్లేపల్లి రామన్న దొర, మండల కార్యదర్శి గంగరాజు, సున్నంపాడు ఎంపీటీసీ అనిల్, సర్పంచ్‌లు సోమిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మి, వైస్ ఎంపీపీ వీరబాబు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి

చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



వాలీబాల్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా

చింతూరు: మారుమూల గిరిజన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి పోలీసుశాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన అల్లిగూడెంలో శనివారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంటు, ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎస్పీ మాట్లాడుతూ పేగ పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో సకాలంలో వైద్యసేవలు అందడంలేదన్నారు. దీంతో వైద్య నిపుణులతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చింతూరు నుంచి అల్లిగూడెం వరకు నడుస్తున్న ఉచిత బస్సు సౌకర్యాన్ని ప్రజల కోరిక మేరకు మల్లంపేట వరకు పొడిగించేందుకు కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు. ఉచిత వైద్యశిబిరంలో 250 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వాలీబాల్ టోర్నమెంటులో 20 జట్లు పాల్గొనగా అల్లిగూడెం జట్టు విజేతగా నిలవడంతో ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ చేతన్, సీఐ నాగేంద్రప్రసాద్, చింతూరు ఎస్‌ఐ రమేష్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, వైద్యులు కోటిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శశికళాదేవి, ప్రసన్న, పేగ సర్పంచ్ పాయం చంద్రయ్య, ఉపసర్పంచ్ భూక్యా బాబూరావు పాల్గొన్నారు.

గర్భస్థ శిశు లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ అన్నారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో లింగనిర్ధారణ నిర్మూలన కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఆడపిల్ల ఇంటికి ఆణిముత్యమన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గ్రహించాలన్నారు. ఏజెన్సీలో బాల్య వివాహాలు నిర్మూలించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. కమిటీ కన్వీనర్ జి.శిరీష, వైద్యులు మోమీనా, ఆదిలక్ష్మి, సీడీపీవో సంధ్యారాణి, ఎన్‌జీవో ప్రతినిధులు కె.రాంబాబు, సంగీత తదితరులు పాల్గొన్నారు.

చదువుపై దృష్టి సారించాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న పీవో సింహాచలం, వేదికపై సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డీఎస్పీ సాయిప్రశాంత్

రంపచోడవరం: ఏజెన్సీలోని కిశోర బాలికలు చదువుపై దృష్టిసారించి ఉన్నత స్థాయికి ఎదగాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. మండలంలోని ఇర్లపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమంలో ఆయనతోపాటు సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, డీఎస్పీ సాయి ప్రశాంత్, డీడీ విజయశాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఉచిత విద్య, వసతి, భోజన సదుపాయం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయని తెలిపారు. బాలికలు బాగా చదవాలన్నారు. 25 సంవత్సరాలు దాటిన తరువాత వివాహం చేసుకోవాలన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విని సివిల్ సర్వీసెస్ ఉద్యోగాలు పొందే విధంగా దృష్టి పెట్టాలన్నారు. బాలురతో సమానంగా అన్ని రంగాల్లో బాలికలు రాణించాలన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ బాలికలు కొంత మంది అబ్బాయిల మాటలు విని మోసపోవద్దని అన్నారు. కొన్ని విషయాలపై మీకు ప్రశ్నించే హక్కు ఉందన్నారు. బాగా చదువుతున్న ముగ్గురు విద్యార్థినులకు సర్టిఫికెట్లు భద్ర పరచుకునే ప్యాడ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో సంధ్యారాణి, ఎంపీడీవో శ్రీనివాసదొర, హెచ్ఎం రాజేశ్వరి, పురోహితులు అద్దంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉదయం చలి.. మధ్యాహ్నం ఎండ



పాడేరులో చలిమంట కాగుతున్న వృద్ధుడు



హుకుంపేట సంతలో గొడుగులను ఆశ్రయించిన వ్యాపారులు

ప్రతాపం చూపుతున్న భానుడు

సాక్షి,పాడేరు: వాతావరణంలో మార్పుల నేపథ్యంలో కొద్దిరోజులుగా విభిన్న వాతావరణం నెలకొంది. రాత్రి సమయాల్లో చలిగాలులు విజృంభిస్తున్నాయి. మధ్యాహ్నం ఎండ చుర్రుమంటోంది. గత కొద్దిరోజులుగా ఉదయం వేళలో పొగమంచు తక్కువగా కురుస్తోంది. దీంతో పాడేరు, హుకుంపేట, జి.మాడుగుల, పెదబయలు, అరకులోయ ప్రాంతాల్లో ఉదయం 7 గంటలకే సూర్యోదయం అవుతోంది. పది గంటల తరువాత వాతావరణం ఒక్కసారిగా వేడెక్కుతోంది. మధ్యాహ్నం 2గంటల వరకు అధిక ఎండతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హుకుంపేట వారపు సంతలో వ్యాపారులు, గిరిజనులు గొడుగులను ఆశ్రయించారు.

ఓటు హక్కు ప్రాముఖ్యత తెలియజేయండి



పాడేరు పాతబస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడిన ఉన్నతాధికారులు, ఉద్యోగులు



రంపచోడవరంలో ఓటరు గుర్తింపు కార్డును పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ



చింతూరులో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

సాక్షి,పాడేరు: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ కోరారు.జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జిల్లా కేంద్రం పాడేరులో శనివారం ఘనంగా నిర్వహించారు. పాడేరు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించిన అనంతరం పాతబస్టాండ్ అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఓటు హక్కు పొందడం, స్వేచ్ఛగా వినియోగించుకోవడంపై అవగాహన కల్పించారు. యువ ఓటర్లకు కొత్త ఓటరు కార్డుల పంపిణీతో పాటు సీనియర్ ఓటర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువతీ,యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో 70 శాతం మేర ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు.ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అన్నారు.గత15ఏళ్ల కృషి ఫలితంగా 2024 ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగం కనపడిందన్నారు. మారుమూల గిన్నెలకోట, ఇంజరి, జామిగుడ పంచాయతీల్లో గిరిజనులు ఓటు హక్కు వినియోగించుకున్నారని, 20వేల మంది పీవీటీజీలను ఓటర్లుగా నమోదు చేశామన్నారు. ఓటర్ల జాబితాల్లో మృతుల పేర్లను తొలగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాడేరు సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, డీఆర్వో పద్మలత, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవో గౌరిశంకర్, రెవెన్యూ అధికారులు, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు పాల్గొన్నారు.

రంపచోడవరం: ఏజెన్సీలోని 18 సంవత్సరాల నిండిన యువతీ,యువకులు ఓటరు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్‌సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. లెనోరా ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేశారు. కొత్తగా ఓటరుగా నమోదైన వారికి గుర్తింపు కార్డులు అందజేశారు. సీనియర్ సిటిజన్లు, వికలాంగులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సాయి ప్రశాంత్, డీటీలు జిలాని, సత్యనారాయణ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించు కోవాలి: చింతూరు పీవో అపూర్వ భరత్

చింతూరు: ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతిఒక్కరూ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని స్థానిక ఐటీడీఏ పీవో అపూర్వభరత్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో శనివారం చింతూరులో ర్యాలీ నిర్వహించి మెయిన్‌రోడ్ సెంటర్లో మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేశారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేడ్కర్, తహసీల్దార్ చిరంజీవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రత్నమాణిక్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిర్వాసితుల పట్ల ప్రభుత్వాల తీరు ఆక్షేపణీయం



మాట్లాడుతున్న సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు

ఎటపాక: పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి సమంజసంగా లేదని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మర్లపాటి నాగేశ్వరరావు విమర్శించారు. శనివారం గన్నవరంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 29న జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభల ప్రచార జాతాను జయప్రదం చేయాలని కోరారు. 2022 గోదావరి వరదల ముంపు ఆధారంగా నిర్వాసితుల ముంపు జాబితాను తయారు చేయాలని గతంలోనే పార్టీ ఆధ్వర్యంలో డిమాండ్ చేశామన్నారు. పెరిగిన జీవన ప్రమాణాలకు అనుగుణంగా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసంపూర్తిగా ఉన్న నిర్వాసితుల కాలనీలను పూర్తి చేయకుండా నిర్వాసితులను తరలిస్తామనడం సమంజసం కాదన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలు వద్దు.. చదువే ముద్దు



పూలబందలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు: మండలంలో గల బూసిపుట్టు పంచాయతీ పూలబంద గ్రామంలో బాల్య వివాహాలు వద్దు,చదువే ముద్దు అంటూ శనివారంప్రాథమిక పాఠశాల హెచ్ఎం పి.ఈ.ఎం.ప్రశాంతి ఆధ్వర్యంలో విద్యార్థులు, గ్రామస్తులు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీ పూలబంద గ్రామం నుంచి తాడేపుట్టు వరకు సాగింది.

పవర్ టిల్లర్ పంపిణీ

డుంబ్రిగుడ: ఎస్వీఎం ఫార్మర్ కంపెనీ లిమిటెడ్ యాజమాన్యం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం పవర్ టిల్లర్‌ను పంపిణీ చేశారు. సాగర పంచాయతీ అడపవలస గ్రామానికి చెందిన తామర్ల పాపారావు అనే గిరిజన కాఫీ రైతుకు సబ్సిడీపై పవర్ టిల్లర్‌ను జీవీఎస్ కార్యనిర్వహణాధికారి జి.గణేష్ అందజేశారు. ఈకార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి



ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

చింతపల్లి: స్థానిక ఏరియా ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలను చెల్లించాలని కోరుతూ కార్మికులు సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రభావతికి వినతి పత్రం అందజేశారు.పారిశుద్ధ్య కార్మికులకు నెలకు రూ.26 వేలు జీతం చెల్లించాలని, బకాయిపడిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని, జీతాల్లో కోత విధించరాదని,మొదటి వారంలోనే జీతాలు ఇవ్వాలన్న డిమాండ్లతో వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో దంత వైద్యనిపుణులు చంద్రశేఖర్, కార్మికులు మంగవేణి,రిబక,ఈశ్వరరావు,గిరి, సుమన్,గున్నమ్మ,బేబి,రామారావు గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తియ్యగా మాట్లాడి.. నిలువు దోపిడీ చేసి..

- హనీ ట్రాప్ కేసులో ఏడుగురి అరెస్ట్
- రూ.68,900 సొత్తు స్వాధీనం
- చాకచక్యంగా కేసును ఛేదించిన భీమిలి పోలీసులు
- నిందితులు పాత నేరస్తులే..
- వివరాలు వెల్లడించిన డీసీపీ(క్రైమ్) లతామాధురి



మీడియాతో మాట్లాడుతున్న డీసీపీ(క్రైమ్) లతామాధురి

విశాఖ సిటీ : విశాఖలో జరిగిన హనీ ట్రాప్ కేసును భీమిలి పోలీసులు ఛేదించారు. సాంకేతికత సహాయంతో దోపిడీదారులు ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.68,900 సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ(క్రైమ్) కె.లతామాధురి తెలిపారు. శనివారం పోలీస్ సమావేశ మందిరంలో మీడియా సమావేశంలో ఆమె చెప్పిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పాతపట్నంకు చెందిన ముంజీ రామారావు వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అతడికి గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఆ కాల్‌లో ఒక మహిళ రామారావు వివరాలు అడిగింది. దీనికి ఆయన మీరు ఎవరో తెలియదని చెప్పి ఫోన్ కట్ చేశాడు. 19 తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో రామారావు తన కుమార్తెను ఆనందపురం మండలం పెద్దిపాలెం వద్ద చదువుతున్న స్కూల్‌లో దిగబెట్టేందుకు వచ్చాడు. తిరిగి వెళుతున్న సమయంలో మళ్లీ అదే నెంబర్ నుంచి మహిళ ఫోన్ చేసింది. మీరు నాకు బాగా తెలుసని, ఒకసారి కలుద్దామని రామారావుకు చెప్పింది. దీంతో ఆయన సదరు మహిళ ఎవరో తెలుసుకునేందుకు ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు ఆమె చెప్పిన విధంగా అనిట్స్ కాలేజ్ జంక్షన్‌లో వేచి ఉన్నాడు. ఆ సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై ఐదుగురు వ్యక్తులు అతని వద్దకు వచ్చారు. అతడిని బలవంతంగా బైక్‌పై ఎక్కించుకొని విజయనగరం రోడ్డులో ఉన్న రఘు ఇంజనీరింగ్ కాలేజ్ ఎదురుగా ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ రామారావుపై దాడి చేసి పర్సులో ఉన్న రూ.10 వేలు, బ్యాగ్‌లో ఉన్న రూ.40 వేలు లాక్కున్నారు. అలాగే ఫోన్ తీసుకొని ఫోన్ పే పాస్‌వర్డ్ తెలుసుకొని అకౌంట్‌లో ఉన్న రూ.8,900 ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్లిపోయారు. అయితే బాధితుడు ముందు పోలీసులకు ఫిర్యాదు చేయడానికి భయాందోళనకు గురయ్యాడు. అతని స్నేహితులకు విషయం చెప్పడంతో వారిచ్చిన ధైర్యంతో భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీసీ ఫుటేజ్ ఆధారంగా..

రామారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన భీమిలి పోలీసులు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. రామారావు వేచి ఉన్న ప్రాంతం నుంచి నిందితులు బైక్‌లపై తీసుకువెళ్లిన మార్గంలో సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. దాని ప్రకారం పోలీసులు నిందితులను గుర్తించారు. ఈ నెల 24న ఐదుగురిని, 25న మిగిలిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాధితుడి నుంచి దోచుకున్న నగదుతో పాటు అతని మొబైల్‌ను పోలీసులు రికవరీ చేశారు.

ఐదుగురు పాత నేరస్తులే..

దోపిడీకి పాల్పడిన ఏడుగురిలో ఐదుగురు పాత నేరస్తులే అని పోలీసులు గుర్తించారు. ఏ1 విజయనగరం జిల్లాకు చెందిన బంగారి చక్రధర్(37) మీద నాలుగు కేసులు ఉండగా, ఆ జిల్లాలో టూటౌన్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. ఏ2 విజయనగరం జిల్లాకు చెందిన డోలా లక్ష్మణరావు(26) మీద ఒక కేసు ఉంది. ఏ3 పెదవాల్తేరు ప్రాంతానికి చెందిన బరికి స్వామి(25)పై మూడు కేసులు ఉండగా.. ఇందులో రెండు రేప్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఏ4 ఎంవీపీ కాలనీకి చెందిన ములపర్తి వెంకటేష్(29)పై ఇదే తొలి కేసు కాగా, ఏ5 వాసుపల్లి శ్యాం ప్రకాష్(30) మీద రెండు కేసులతో పాటు ఎంవీపీ స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. అలాగే ఏ6 విజయనగరం జిల్లా కొత్తపేటకు చెందిన ఎంటి సురేష్(30) మీద ఒక కేసు ఉండగా, ఏ7 ప్రధాన నిందితుడి స్నేహితురాలు ఊర్వశీ జంక్షన్‌కు చెందిన కుప్పిలి ఆకారాణి అలియాస్ శ్రావణి(34)పై ఇదే తొలికేసు నమోదైంది. కేసును ఛేదించిన భీమిలి పోలీసులను డీసీపీ(క్రైమ్) లతామాధురి అభినందించారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదు



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ కోరాబు అనూషదేవి

చింతపల్లి: జిల్లా వ్యాప్తంగా మాతాశిశు మరణాలు పెరుగుతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని, ఇటీవల శిశుమరణాలపై ప్రశ్నించిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి విమర్శించడం విడ్డూరంగా ఉందని చింతపల్లి మండల పరిషత్ అధ్యక్షురాలు కోరాబు అనూషదేవి అన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీటీసీలు,సర్పంచ్‌లతో కలసి సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చౌడుపల్లి పంచాయతీ పరిధిలో గల వాంగెడ్డ కొత్తూరులో శిశు మరణాలపై విచారణ జరపాలని ఎమ్మెల్యే డిమాండ్ చేయడంతోనే వైద్య బృందం తరలి వచ్చిందని, లేకుంటే ఏం జరిగిందో బయట ప్రపంచానికి తెలిసేది కాదన్నారు. గత ప్రభుత్వంలో గిరిజన ప్రాంతంలో మాతా శిశు మరణాలను తగ్గించేవిధంగా గర్భిణులకు వసతి గృహాలను అందుబాటులోనికి తీసుకువచ్చామని చెప్పారు. ఇప్పటి వరకూ ఈ ప్రాంతంలో ఏ కష్టం వచ్చినా వెంటనే గ్రామాలకు వెళ్లి కుటుంబాలను పరామర్శించడంతో పాటు ఏరియా ఆస్పత్రిని సందర్శించి, వైద్యాధికారులతో చర్చించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. అటువంటిది ఇప్పటి వరకూ ఒక్కసారైనా ఆస్పత్రిని ఎమ్మెల్యే సందర్శించారా అని ప్రశ్నించడంలో అర్థం లేదన్నారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఏరియా ఆస్పత్రికి ఎన్ని నిధులు కేటాయించారో, ఏ నిధులు చైర్మన్‌గా ఉన్న ఎమ్మెల్యే ఖర్చు చేయలేదో తెలయజేయాలన్నారు.తమ ప్రభుత్వ హయాంలోనే 100 పడకల ఆస్పత్రి మంజూరైందని చెప్పారు. ఆ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కూటమి ప్రభుత్వంలో వైద్య పరంగా ఏం ఒరగబెట్టారో తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత,చౌడుపల్లి,కొత్తపాలెం సర్పంచులు గెమ్మిలి లలిత, వనగల సోమరత్నం,కో ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ,మాజీ వైస్ ఎంపీపీ బూసరి కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సాగిన గంగన్నపడాల్,గెమ్మిలి సింహాచలం,మత్స్యరాజు,మధు,మత్స్యలింగం తదతరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ పీహెచ్‌సీ తనిఖీ



డుంబ్రిగుడ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా



జుర్రిపాడులో గర్భిణిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్‌బాషా

డుంబ్రిగుడ: స్థానిక పీహెచ్‌సీని శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా తనిఖీ చేశారు. ముందుగా వార్డులో ఉన్న బాలింతలతో మాట్లాడారు. వారికి అందుతున్న తెలుసుకున్న ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. బర్త్ వెయిటింగ్ హాల్, మందుల నిల్వలను పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఓపీ వివరాలను వైద్యాధికారి అంబికా రమణి నుంచి తెలుసుకున్న ఆయన సమీపంలో 104 సేవలు అందిస్తున్న జుర్రిపాడు గ్రామాన్ని సందర్శించారు. గర్భిణులతో మాట్లాడారు. రక్తపరీక్షలను పరిశీలించారు. అవసరమైన మందులను అందజేశారు. స్థానిక వైద్యాధికారి పి. రాంబాబు గ్రామ పరిస్థితులను వివరించారు. గ్రామానికి రవాణా సౌకర్యం లేనందున స్థానిక ఆశా కార్యకర్త భర్త రోగులను ఉచితంగా మండల కేంద్రానికి తరలించి సేవ చేస్తున్నారని, అతని సాయం అందించాలని డీఎంహెచ్‌వోను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సౌరీ పీహెచ్ఎన్ మంజుల, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

నిధి 'ఆప్ కే నికట్' రేపు

రాజమహేంద్రవరం రూరల్: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిధి ఆప్ కే నికట్ – జిల్లా ఔట్ రీచ్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్టు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వై.డి. శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఆయా సంస్థలు, ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ ఫిర్యాదులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఈ శిబిరాల్లో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు కూడా సమర్పించవచ్చని తెలిపారు.

శిబిరాలు ఎక్కడంటే..

- రాజమహేంద్రవరం కవలగొయ్యి రోడ్డులోని ది ఫ్యూచర్ కిడ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయం.
- కాకినాడ వాకలపూడి సంతోషిమాత ఆయిల్ రిఫైనరీ కార్యాలయం.
- కోనసీమ జిల్లాకు సంబంధించి యానాం పీపుల్స్ వలంటరీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ కార్యాలయం.
- ఏలూరు జిల్లాలో ఏలూరు శనివారపుపేట పీఏసీఎస్ కార్యాలయం.
- పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం సింగంపల్లి పీఏసీఎస్ కార్యాలయం.
- అల్లూరి సీతారామరాజు జిల్లా దాలిపాడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, గంగవరం మండలం మోహనపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, మారేడుమిల్లి మండలం దేవరపల్లి ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల.

95 మందికి వైద్య సేవలు



లండూలులో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సత్యారావు

పెదబయలు: మండలంలోని మూరుమూల గిన్నెలకోట పంచాయతీ లండూలు,గొచ్చంగి,పెదపాడు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, 95 మందికి వైద్య సేవలు అందించినట్టు రూడకోట పీహెచ్‌సీ వైద్యాధికారి పి.సత్యారావు తెలిపారు. గ్రామాల్లో జ్వరాలు ప్రబలినట్టు సమాచారం రావడంతో వైద్య శిబిరం నిర్వహించినట్టు ఆయన చెప్పారు. జ్వరంతో బాధపడుతున్న ఏడుగురి నుంచి రక్తన మూనాలు సేకరించినట్టు చెప్పారు. వైరల్ జ్వరాల కారణంగా కొంత మంది శరీరంపై దద్దుర్లు ఉన్నాయని, జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపించాయని తెలిపారు. కొంతమందికి ఆటలమ్మ సోకిందని, అందరికీ మందులు ఇచ్చి, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించినట్టు తెలిపారు. ఎంపీహెచ్ఈవో వి. బింగురాజు,హెల్త్ అసిస్టెంట్ డి.చిట్టిబాబు. ఏఎన్ఎం లక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయండి

పాడేరు : గిరిజన విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు పటిష్టమైన పునాదులు వేయాలని ఐటీడీఏ పీవో అభిషేక్ అన్నారు. పట్టణంలోని లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులు బోధిస్తున్న ఏజెన్సీ 11 మండలాల ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో అభిషేక్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో కనీసం 30 శాతం మంది ఉత్తమ విద్యార్థులుగా ఎదిగితే ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని పీవో చెప్పారు.

డిగ్రీ కళాశాలలో క్యాంటీన్ ప్రారంభం



క్యాంటీన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో అందరికీ పౌష్టికాహారం అందే విధంగా నూతనంగా క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్టు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ భారతి తెలిపారు.శనివారం ఈ క్యాంటీన్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజు ఈ క్రీడా మైదానంలో ఉదయం,సాయంత్రం వాకర్స్, క్రీడాకారులు అధికంగా వస్తున్న నేపథ్యంలో వారికి కావలసిన పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ క్యాంటీన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ వి. రమణ, కె.లీలాపావని,డాక్టర్ కేజియా,సంతోషి,టి. జగత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

రచ్చబండ నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న గసభ సర్పంచ్ సునీత

డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ లోగిలి గ్రామంలో రచ్చబండ నిర్మాణానికి ఓసం గ్రామ సర్పంచ్ పాంగి సునీత శనివారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ. 2 లక్షలతో రచ్చబండ నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈకార్యక్రమంలో గసభ ఎంపీటీసీ వంతాల జెమ్మ, ఉప సర్పంచ్ మహాదేవ్, వార్డు మెంబర్లు సత్యనారాయణ, పార్వతి, శాంతి, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు గోవింద్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గణేష్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

అడ్డతీగల: అసాంఘిక కార్యకలాపాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి అన్నారు. లంగుపర్తిలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో ఫోన్‌కాల్స్ మాట్లాడడం,చాటింగ్ వంటివి చేయరాదని సూచించారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామని సీఐ చెప్పారు.ఎస్ఐ వినోద్ పాల్గొన్నారు.

వివాహితను వేధించి రూ.5.60 లక్షలు కాజేశాడు

- పోర్టు ఉద్యోగికి రిమాండ్

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు, వలందపేటకు చెందిన ఒక వివాహితను శారీరకంగా వేధించి రూ.5.60 లక్షలు కాజేసిన పోర్టు ఉద్యోగి గొరక జానకీరావును భీమిలి పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గాజువాక జగ్గు సెంటర్‌కు చెందిన నిందితుడు పోర్టులోని ఫైర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. వలందపేటకు చెందిన బాధితురాలు నిందితుడికి దగ్గరి బంధువు. ఆమెకు 15 ఏళ్ల కుమార్తె ఉంది. గత ఏడాది అక్టోబర్ నుంచి జానకీరావు వివాహితకు పదేపదే ఫోన్ చేసి, 'నీ కుమార్తె నగ్న వీడియోలు నా వద్ద ఉన్నాయంటూ'బెదిరించి దఫదఫాలుగా వారి నుంచి రూ.5.60 లక్షలు కాజేశాడు. అయినప్పటికీ వీడియోలు డిలీట్ చేయకుండా వివాహితను మరింత బెదిరించి శారీరకంగా లోబరుచుకున్నాడు. అక్కడితో ఆగకుండా భర్తను వదిలి తనతో వచ్చేయాలని ఆమెపై ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో సహించలేని బాధితురాలు బంధువుల సహాయంతో శనివారం భీమిలి పోలీసులను ఆశ్రయించింది. సీఐ బి.సుధాకర్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, న్యాయస్థానం ఆరు నెలల రిమాండ్ విధించింది.

చోరీకి గురైన 7 బైకుల రికవరీ



స్వాధీనం చేసుకున్న బైకులతో పోలీసులు

ఎస్.రాయవరం: ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 7 బైకులు పట్టుబడినట్టు నర్సీపట్నం డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. అడ్డురోడ్డులో నక్కపల్లి సర్కిల్ కార్యాలయంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణరావు వాహనాలు తనిఖీ చేస్తుండగా రికార్డులు లేని రెండు బైకులను సీజ్ చేశారన్నారు. ఆ బైకులు తరలిస్తున్న వ్యక్తులను విచారించగా మరో 5 బైకుల వివరాలు తెలిశాయన్నారు. ఇందులో ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కాబడిన ఒక బైకును గుర్తించారన్నారు. బైకులు చోరీ చేసి తరలిస్తున్న వారిలో తిమ్మాపురంలో నివసిస్తున్న, పాయకరావుపేట మండలం అరట్ల కోటకు చెందిన శలం శెట్టి దుర్గాప్రసాద్, ధారకొండకు చెందిన సాయిలను అరెస్టు చేసి విచారణ చేపట్టామన్నారు. దీంతో ఏలూరు వన్‌టౌన్, నర్సీపట్నం రూరల్, నక్కపల్లి, ఎంవీపీ, గండిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బైకుల చోరీ కేసుల వివరాలు తెలిశాయన్నారు. బైకుల రికవరీకి కృషి చేసిన సీఐ, ఎస్ఐలను ఎస్పీ తుహిన్‌సిన్హా అభినందిచారన్నారు.